# భిన్న ధృవాలు

**-విశ్వసాయి**

ఆఫీస్ నుండి ఇంటికొచ్చేసరికి బాగా చీకటి పడింది. అలసటగా వుంటే బయటవున్న కుర్చీలో కూర్చున్నాను.

నా రాకను గమనించిన శ్రీమతి చల్లటి మంచినీళ్ళు, వేడివేడిగా లెమన్ టీ అందిస్తూ అడిగింది. "గృహ ప్రవేశానికి డబ్బులు కుదిరాయా?" అని.

"ఇంకా లేదు" ముక్తసరిగా జవాబిచ్చాను. ఒకింత దెబ్బతిన్న స్వాభిమానపు స్వరంతో.

"నింపాదిగా, తాయితీగా పనులు చేసుకోడానికి అట్టే సమయం లేదు. మనం ముందుగా మేల్కొనుంటే బాగుండేది. ఫ్చ్. ఆ కార్యక్రమం ఎలా ఒడ్డెక్కుతుందో ఏమిటో? ఆ ఇంటి పని నేరకపోయి మొదలెట్టాం. కనిపించిన వాడినల్లా అప్పుకోసం దేబిరించవలసి వస్తోంది" అంది శ్రీమతి. ఆ గొంతులో అనంతమైన వేదన ధ్వనిస్తోంది.

"నిజమే. నాకూ అలానే అనిపిస్తోంది" అన్నాను నేను.

నా సంపాదనకి, నా ఆర్థిక స్థితికి అనుగుణంగా బొమ్మరిల్లు లాంటి ఇంటికి ప్లాన్ చేసుకొని రంగంలోకి దిగితే, ముందు వాస్తు సిద్ధాంతి, ఆ తర్వాత కడుతున్న ఇంటిని చూడటానికి వచ్చిన బంధుహిత జనం, తమ తమ అనుభవాలతో మమ్మల్ని సంధిగ్దావస్తలో పడేసి, భయపెట్టి మా బొమ్మరిల్లుని మార్పులు చేర్పులతో భోషాణం లెవిల్లోకి లాక్కెళ్ళేటట్టు చేసారు.

పర్సుని బట్టి మార్కెటింగ్ అన్నట్టు, ఇల్లు కూడా చూడముచ్చటగా మా దిష్టే తగిలేలా తయారైంది. ఖర్చూ తడిసి మోపెడై పెనుభారంగా మారింది. ఎంత కూలర్‌కి అంత గాలేగా మరి.

ఇప్పుడు సందట్లో సడేమియా అన్నట్లు గృహ ప్రవేశం ఖర్చు పీకల మీదకు వచ్చి కూర్చొంది. కష్టాలలో కన్నీళ్ళలో తోడునీడై మెలిగే మా బంధువర్గం చాలా పెద్దది. ఇటు బంధుజనం, అటు సన్నిహితం. అందర్నీ పిలుచుకోవాలి. అనాదిగా వస్తున్న ఆనవాయితీని, ఆచార వ్యవహారాలని త్రోసిరాజనలేం గదా. పిలిచి తృణమో పణమో సమర్పించిగాని పంపలేం కదా. ఆ డబ్బు కోసం వెదుకులాట ప్రారంబమైంది. నా తలరాతేమో, ఎవర్నడిగినా మొహం చాటేస్తున్నారు. గోతిలో పడ్డ గొడ్డు మీద పడేవి రాళ్ళేగాని పూలు కావుగా.

"ఏమండీ, సాయిరాంగారు వస్తున్నారు. ఆయన్ని అడగండి. మీరు నోరు విప్పి అడిగితే కాదనరు" సానునయ పూర్వకంగా సలహా యిచ్చింది శ్రీమతి.

నాకూ అలానే అనిపించటంతో క్రొత్త ఆశ చిగురించింది.

"నమస్తే సార్. రండి" సాదరంగా ఆహ్వానించాను.

అతను పిసినారి వాడంటారు. కాని తరచి చూస్తే పొదుపరి అనిపిస్తుంది. సంస్కరణాభిలాషి కూడా. అతన్ని మనిషిగా చూసేకంటే, పుస్తకంగా చదువుకోవాలి. ఏ విషయాన్నైనా అన్ని కోణాల్లోంచి ఆలోచించి మంచి నిర్ణయాన్ని క్షణాల్లో తీసుకోవడం అతని ప్రత్యేకత.

"మీ గృహప్రవేశం ఎప్పుడు సార్?" కూర్చోగానే అడిగారు.

"వచ్చే గురువారమే" అన్నాన్నేను.

"లోగడ నే చెప్పినట్టు ముందు మా వాడి పెళ్ళి జరుగుతోందన్నమాట. ఎల్లుట రాత్రి మా కనిష్ట పుత్రుడి వివాహ మహోత్సవం జరిపించటానికి తమబోటి పెద్దలు నిశ్చయించారు. కాన, ఆనాటికి తమరు విచ్చేసి మా ఆతిథ్యం స్వీకరించి నూతన వధూవరులను ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నాను" అని శుభలేఖ అందించారు.

నాకు పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. నోట మాట రాలేదు. అనుకున్నదొకటి, అయినదొక్కటి. నా ముఖ కవళికలను గమనించిన శ్రీమతి, "ఏమండీ, మీరు వర్రీ చెందనక్కర్లేదు. ఇదీ ఒకందుకు మంచిదే. మగపిల్లాడి పెళ్ళిగా చేస్తున్నారు. దండిగా కట్నం డబ్బులు అందుంటాయి. అడిగితే కాదనరు. అయినా ఊరకే కాదుగా, వడ్డీకేగా" ఊదింది నా చెవిలో కర్ణభేరిని తింటూ.

వినడానికి నా చెవి ఒప్పుకున్నా, అడిగేందుకు నా మనసు సిద్ధంగా లేదు.

"ఏమిటో భార్యాభర్తలు చెవులు కొరుక్కుంటున్నారు?" అడిగారు సాయిరాంగారు.

"అబ్బే, నేనే కొరికానండీ. పెళ్ళి ఈ ఊర్లో కాకపోతే, మన గృహ ప్రవేశానికి కూడా కలిసొచ్చినట్టు

ఆఫీసుకు సెలవు పెట్టండన్నా. ఎమర్జన్సీ సర్వీసు కదా. అప్పటికప్పుడు సెలవు దొరకటం కష్టం కదాని" అంది శ్రీమతి. తన బుర్ర శకుంతలా దేవిలా యమ షార్పు లెండి.

అందుకున్న శుభలేఖని పైకి చదువుతున్నాను. చివరన "గమనిక" ఉంది. ధన వస్తు కనక రూపాల్లో గాని, ఏ ఇతర రూపాల్లో గాని కానుకలు స్వీకరింపబడవు. దయచేసి కానుకలు తేవద్దు. ఇదీ గమనిక.

నేను శ్రీమతి ఆశ్చర్యపోయాం. "పోన్లెండి. ఐదొందలు మిగిలింది" అంది శ్రీమతి మళ్ళీ నా కర్ణభేరి తింటూ.

"మళ్ళీ ఆయన చెవి కొరికేస్తున్నారు" అన్నారు సాయిరాంగారు నవ్వుతూ.

"దీనికేదో రీజనుంటుంది. సాయిరాం గారిని అడగండి, మనమూ ఫాలో అవుదాం. చెప్పానంతే" అంది శ్రీమతి.

"భేషుగ్గానమ్మా. ఫంక్షననగానే మనకు అవసరం లేని బోలెడు గిఫ్ట్సు వచ్చి పడుతుంటాయి. కాబట్టి వాటి సేవలు నిరుపయోగం అయి వేస్టుగా పడుంటాయి. వాటిని మనకి ఇచ్చే వ్యక్తుల యొక్క ఆశ వమ్ము అవుతుంది. ఇక ధన రూపేణా వస్తే, ఆ సమయంలో ఆ సొమ్ము లగ్జరీ పద్దుల క్రింద పోతుంది. అంటే వేరొకరి కష్టార్జితం బూడిదలో పోసిన పన్నీరవుతోందన్న మాటేగా.

ఒకరి వస్తువు లేదా డబ్బు అవసరమైన లక్ష్యం నుండి ప్రక్కత్రోవలకి మళ్ళునపుడు, వారి నుండి గిఫ్ట్స్ తీసుకోవడం వల్ల మనం పొందే ప్రయోజనం ఏముంటుంది?" అడిగారాయన.

నా శ్రీమతి బుర్ర బొంగరంలా గిర్రున తిరిగి పోయింది. పొరపాటున "అడగండి" అన్న నేరానికి ఇంత శిక్షా అన్నట్టు ఆముదం త్రాగిన ముఖం పెట్టేసింది.

"ఇంకో విషయం చెప్పమంటారా?"

"చెప్పండి-" అన్నాం.

"మా వాడికి కట్నం, తీసుకోవటం లేదు. కట్నమే కాదు కానుకలు, లాంఛనాలు కూడా ఏమీ లేవు" అన్నారు.

మా గుండెలో రాయిపడ్డట్టయింది. అతని దగ్గర నాలుగు రాళ్ళు ఉండి ఉంటాయి. ఆపదలో ఆదుకుంటాడనుకున్నాం గాని ఇలా ఆడుకుంటాడనుకోలేదు.

"వీడికే కాదండోయ్. మా పెద్దబ్బాయికీ, నా పెళ్ళికి కూడా కట్నం తీసుకోలేదు. సరికదా అంతా యాభై మంది కంటే ఎక్కువ మంది వచ్చినా, పెళ్ళి అతి నిరాడంబరంగా జరిపించక పోయినా, పీటల మీంచి లేచిపోతానని ఖరాఖండీగా చెప్పేసాను మా మావగారికి. వీడి పెళ్ళికీ అంతే, మీ బోటి వాళ్ళతో కలిసి వంద మందికి మించరు" అన్నారు.

"ఎందుకలా?" అడిగాను ఆశ్చర్యపోతూ.

"అలనాటి స్వర్ణయుగం సాంప్రదాయాన్ని, ఆచారాలనీ, ఆనవాయితీలని, ఇప్పుడు కూడా గబ్బిలాల్లా పట్టుకు వ్రేలాడుతుండడం వల్ల, మధ్యతరగతి ఆడపిల్లల తల్లిదండ్రులు ఎంత నరకయాతన అనుభవిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. వారినలా బాధించడం ఎంతవరకు సమంజసమో

## బింబానికీ ప్రతిబింబానికీ మధ్య

**బిం**బం కళ్ల ఎదుట కనబడుతూనే ఉన్నా
ప్రతిబింబాన్ని చూడడానికే ఎప్పుడూ ఆరాటం!
బింబానికీ ప్రతిబింబానికీ మధ్య
పరిణమిస్తున్న ప్రకృతి ఏమిటో గానీ
బింబంలోని స్వచ్ఛతనూ, సహజత్వాన్నీ
విలక్షణంగా ఉండనివ్వడం లేదు.
బింబం ఎప్పుడూ అంబరంలోనే ఉంటుంది.
అవనిపై తన ప్రతిబింబాన్ని చూస్తుంటుంది.
అయినా నేల అద్దంలో ఉన్న ప్రతిబింబం
అసలు బింబాన్ని చూడడం లేదు.
నీడ ఎప్పుడూ వెలుగు కాలేదు.
వెలుగు పొత్తిళ్లలోనే అది సేదదీరుతూ ఉంటుంది.
బింబపు ఛాయలో కనబడే
'నకిలీ' పదార్థాలనే కంటుంది.
బింబాన్ని చేరుకోవాలని ప్రతిబింబం అనుకోదు.
విస్తరించిన బింబం నీడనే
విపుల విశ్వంగా భావిస్తుంది.
అదే ధ్యాసలో కన్నులు మూస్తుంది.

-డా. అయాచితం నటేశ్వరశర్మ

చెప్పండి. అంతేకాదు, సామాజికపరమైన, వస్తు వినియోగపరమైన ఇబ్బందులూ తలెత్తుతుంటాయి."

"ఫంక్షనన్నాక తెలిసిన వాళ్ళందరీన్నీ పిలుచుకోకపోతే ఏం బావుంటుందండీ? వాళ్ళేమీ అనుకోరా?" అడిగాను నేను.

"నిరాడంబరంగా కార్యక్రమం జరిపించారనుకుంటారు. ఇలా చేస్తే మధ్యతరగతి వాడికి అప్పుల బాధ ఉండదని సంతోషిస్తారు. మనల్ని చూసి వాళ్ళు, వాళ్ళని చూసి మరొకరు అలా అంతా ఈ పద్ధతినే అనుసరిస్తారు. అప్పుడిదే ఆచారమౌతుంది. సాంప్రదాయమవుతుంది."

"దీనివల్ల బంధుత్వాలు దెబ్బతినవా?" అడిగింది శ్రీమతి.

"దానికి దీనికి సంబంధమేమిటమ్మా. తుంటి మీద కొడితే పళ్ళు రాలతాయటమ్మా. బంధుత్వాలు, స్నేహ బంధాలు పెంచుకోడానికి మంచి మనసు, విశాల హృదయం ఉండాలి గాని, పెళ్ళిళ్ళకి పేరంటాలకి పిలుచుకోవటం కాదు."

"మరి మీ కుటుంబ సభ్యులు మీతో ఏకీభవిస్తున్నారా?" అడిగాను నేను.

"ఇంటికి పెద్దవాడిని. జీవితాన్ని కాచి వడబోసిన అనుభవంతో చెప్తుంటే వారెందుకు ఏకీభవించరు? ఒకవేళ ఏకీభవించక అలక వహించారే అనుకొండి - పిల్లల్ని బజారుకు తీసుకువెళితే చూసినవన్నీ కావాలని మారాం చేస్తారు. ఏడుస్తారు. పిల్లలు ఏడుస్తున్నారని అడిగినవన్నీ కొని ఇచ్చేస్తామా? లాలించో, బుజ్జగించో, దెబ్బలాడో వారి మనసు మార్చమా. ఇది కూడా అలాంటిదే.

అయినా నా పెంపకంలో పెరిగిన వాళ్ళకి, నా మనస్తత్వం ఏనాడో అవగతమైంది. కాబట్టి అటువంటి సమస్య తలెత్తదు" ఇక నే వెళ్తాను అంటూ బయల్దేరారు.

నేను శ్రీమతి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. కనువిప్పు కలిగిన భావన ఇద్దర్లోను ద్యోతకమవుతోంది. ఇప్పటివరకు చేసిన అప్పులు చాలుగాని, ఇక మీద ప్రతీ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహిద్దామన్న నిర్ణయానికి వచ్చేసాం.

ఇలా సాయిరాంగారు బయటకు వెళ్ళారో లేదో, అలా అతడి కనిష్ట పుత్రుడు పెళ్ళి కొడుకు వచ్చాడు. వస్తూనే, "చూసారా! చూసారా! మా నాన్నకి వయసు పెరుగుతున్న చాదస్తమూ పెరుగుతోంది. ఆఫీస్ స్టాఫ్, ఫ్రెండ్స్ అంతా కలిపి ముఖ్యుల్ని పదిమంది వరకే పిలుచుకోమని కండిషన్ పెట్టారు.

పోనీ మా ఆఫీస్ స్టాఫ్‌కి, ఫ్రెండ్స్‌కి వేరేచోట విందు ఏర్పాటు చేసుకుంటానంటే దానికీ ఒప్పుకోవడం లేదు. నేనేమైనా భద్రాద్రి రాముడ్నిటండీ, ఈసారి కాకపోతే వచ్చే ఏడు కళ్యాణానికి అందర్నీ పిలుచుకొని పార్టీ ఇచ్చుకోడానికి.

శుభకార్యమన్నాక బంధువుల్ని, స్నేహితుల్ని ఇరుగు పొరుగుని పిలుచుకోకపోతే వారితో అనుబంధాలు ఎలా బలపడతాయి? పరపతి ఎలా పెరుగుతుంది. లింగు లిటుకుమని తనొక్కడే శొంఠికొమ్ములా నిలబడి అతి నిరాడంబరంగా పెళ్ళి జరిపిస్తానంటే అది మహోత్సవమెలా అవుతుంది. ఆనందదాయకంగా ఎలా ఉంటుంది.

ఈరోజు మనం వాళ్ళని పిలిస్తేగా రేపు వాళ్ళు మనలని పిలిచేది. లేదంటే మనల్ని ఏకాకిని చేసి సమాజం నుండి వెలివేసినట్లు వదిలేయరుటండీ? మన కష్టాల్లో వారు వచ్చి ఆదుకుంటారండీ? ఊరందరిది ఒకదారి ఉలిపి కట్టెది ఒకదారి అన్నట్టు, ఈయనిలా ప్రవర్తిస్తే ఈ సమాజంలో ఎలా కుదురుద్ది? ఎవరు హర్షిస్తారు?

మన శుభాల్లో భుజం తట్టి అభినందించిన వారే, మన కష్టాల్లో వెన్నుతట్టి మేమున్నామని ఆదరిస్తారు. ఆ మాత్రం అర్థం చేసుకోపోతే ఎలా?

ఇలాంటి వాళ్ళ వల్లే వెర్రి వెంగళప్ప అనే పేరు పుట్టుకొచ్చినట్టుంది. మా నాన్న వస్తే మీరైనా నచ్చజెప్పండి. ప్లీజ్" అన్నాడు బయల్దేరుతూ.

తండ్రీ కొడుకులు పీకిన క్లాసులతో హై ఓల్టేజికి మాడిపోయిన బల్బుల్లా మా ఇద్దరి మొహాలు మలమల మాడిపోయాయి. ఆశ మొగ్గ తొడిగి వికశించే సమయంలో అగ్నికీలలకు ఆహుతైనట్లు అనిపించింది. తర్వాత భిన్న ధృవాలు విభిన్న రీతుల్లో క్లాసు పీకటంతో సంధిగ్ధావస్థ ఏర్పడింది.

ఏం చేయాలో పాలుపోక నేను నింగిలో చుక్కల్ని లెక్కపెడుతున్నాను. శ్రీమతి చటాలున లేచి "ఏది ఏమైనా ఈ ఫంక్షను గ్రాండుగా జరిపించుకోవాల్సిందే. రేపే నేను మా పుట్టింటికి వెళ్ళి డబ్బు ఏర్పాటు చేసుకొని వస్తాను" అని లోనికి వెళ్ళిపోయింది.

తన అభిప్రాయంతో ఏకీభవించని నేను వెర్రి వెంగళప్పలా దిక్కులు చూస్తూ కూర్చున్నాను.